

ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు, ఇళ్లలోకి చేరుతున్న డ్రైనేజీ నీరు (ఇన్‌సెట్లో), మురుగు నీటిలో మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్

ముంచెత్తుతున్న మురుగు

పూర్తిగా శిథిలావస్థకు చేరిన రామగుండం ప్రధాన డ్రైనేజీ

రామగుండం: పాలకులు మారినా రామగుండం ప్రధాన డ్రైనేజీ సమస్య మాత్రం అలాగే ఉంది. రోడ్డుపై మురుగునీరు పారడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ స్వగృహానికి సమీపంలోనే ఉంది ఈ డ్రైనేజీ. ఎమ్మెల్యేతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. 40ఏళ్ల క్రితం బండరాళ్లతో నిర్మించిన ప్రధాన డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో పాటు పెరిగిన జనాభాతో నీటి వినియోగం, వెలువడే వ్యర్థజలాలు సైతం అదే స్థాయిలో పెరగడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. బండరాయితో నిర్మించిన డ్రైనేజీ కావడంతో మట్టి డ్రైనేజీలోకి చేరుతూ బండరాళ్లు సైతం కూలిపోతున్నాయి. పందికొక్కుల మూలంగా బండరాళ్లలో వచ్చే సందుల్లో పిచ్చిమొక్కలు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ఫలితంగా మురుగు నీరు ప్రధాన రహదారిపై నుంచి పారుతోంది. దీంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ వాల్వు సైతం మురుగులోనే ముంచెత్తుతోంది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీ కాలువ శిథిలమైంది



40ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ కావడంతో పూర్తిగా శిథిలమైంది. ఎమ్మెల్యే ఇంటి ఎదుట నుంచి శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం వరకు ఉన్న శిథిలావస్థకు చేరిన డ్రైనేజీని కూలదోసి నూతనంగా సీసీ కాంక్రీట్‌తో డ్రైనేజీ నిర్మించాలి. అప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇళ్ల ముందున్న ప్రధాన డ్రైనేజీతో ప్రజలు, స్థానికులు కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– బందారపు రాంచందర్‌గౌడ్, స్థానికుడు

ఎన్నికల కోడ్ అడ్డంకి..



భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించాలనుకునే లోగా ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల తర్వాత పనులు ప్రారంభిస్తాం. గతేడాది ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించే క్రమంలో అప్పటి కమిషనర్ కొన్ని నిర్మాణాలు కూలగొట్టి డ్రైనేజీ నిర్మించాలని సూచించారు. కానీ పక్కాగృహాల యజమానులు అభ్యంతరం తెలిపారు. భూగర్భంలో జెన్‌కోకు చెందిన భారీ పైపులైన్ అడ్డంకిగా ఉంది. భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి కార్పొరేషన్‌లో వర్క్ ఆర్డర్ దశలో ఉంది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. – కౌశిక లత, 22వ డివిజన్ కార్పొరేటర్

భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తాం



పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ సమస్యపై నాకు అవగాహన ఉంది. మా ఇంటి ఎదుట నుంచి శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం వరకు డ్రైనేజీ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన డ్రైనేజీని కూల్చివేసి నూతనంగా భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తాం. అదేవిధంగా రహదారిని విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తా. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను సమస్యల రహిత డివిజన్లుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

తల్లిదండ్రులకు కేఆర్‌పీ రెడ్డి నివాళి



నివాళి అర్పిస్తున్న 'సాక్షి' మీడియా సంస్థల ఏడీవీటీ డైరెక్టర్ కేఆర్‌పీరెడ్డి

కాల్వశ్రీరాంపూర్: 'సాక్షి' మీడియా సంస్థల ఏడీవీటీ డైరెక్టర్ కాల్వ రాజప్రసాద్‌రెడ్డి(కేఆర్‌పీరెడ్డి) మంగళవారం తన తల్లిదండ్రులకు నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని తన తల్లిదండ్రులు కాల్వ లీలావతి–మాజీ ఎమ్మెల్యే కాల్వ రాంచంద్రారెడ్డి సమాధులను సందర్శించారు. సమాధులపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేఆర్‌పీరెడ్డి సోదరులు కాల్వ వెంకటేశ్వర్‌రెడ్డి, కాల్వ అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో సీఈవో కోలేటి శ్రీనివాస్, వేదవ్యాస ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ సదానందం, పీఈటీ దివాకర్, నాయకులు మొగిలి, రవి, మహంకాళి, కుమార్, జగన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి తదితర గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలను మంగళవారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ క్షేత్రస్థాయిలోకి వెళ్లి కలిశారు. అనంతరం వారికి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఉపాధి కూలీలకు తగిన సూచనలు, సలహాలిచ్చారు.

క్లుప్తంగా

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



కవర్లు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కోల్‌సిటీ/జ్యోతినగర్: రామగుండం నగరపాలక సంస్థ సిబ్బంది మంగళవారం నగరంలో వివిధ చోట్ల తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. రామగుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని చౌరస్తా ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న కర్రీ పాయింట్లు, హలీమ్ కేంద్రాల వారికి ప్లాస్టిక్ వాడొద్దని అవగాహన కల్పించారు. థర్మాకోల్‌తో తయారు చేసిన ప్లేట్లలో కూడా ఆహార పదార్థాలు వడ్డించరాదని అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో రామగుండం నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, సూపర్‌వైజర్ సంపత్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం

జ్యోతినగర్: ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు వరంగా మారాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల రాజేందర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో మంగళవారం చేపట్టిన లబ్ధి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు పీఎం కిసాన్ ద్వారా కేంద్రప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోందన్నారు. ఇప్పటివరకు 31కోట్ల మంది ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రయోజనం పొందారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి గాండ్ల స్వరూప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధి సంపర్క్ అభియాన్ కన్వీనర్ మాతంగి రేణుక, నాయకులు రాజేశ్, సోమారపు లావణ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాలకుర్తి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలకుర్తి మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం బసంత్‌నగర్ ఎస్సై స్వామి పరిశీలించారు. పాలకుర్తి మండల కేంద్రంతో పాటు ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఆయా కేంద్రాల్లోని సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

పంటల సాగు విధానంపై అవగాహన

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతుల వేదికలో మంగళవారం రైతులకు సమగ్ర వ్యవసాయం, డ్రోన్లతో వ్యవసాయంపై వీడియో కాన్ఫరెన్స్‌తో అవగాహన కల్పించారు. రాబోయే సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ సాగు విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఏవో ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో ఉన్న హనుమాన్‌తోపాటు నవగ్రహాలకు పూజారి మహేశ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రేపు బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలోని బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జవహర్‌నగర్ సరస్వతి శిశుమందిర్‌లో ఈనెల 28న నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం మేదర్‌బస్తీ, కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ ఏరియాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ప్రచారం కొనసాగుతుందన్నారు.

2న పెద్దాపూర్ జాతర వేలం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతర వేలం ఏప్రిల్ 2న నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో సదయ్య తెలిపారు. ఆలయానికి ఉన్న వ్యవసాయ భూమి సర్వేనెంబర్ 316లో 1.35 ఎకరాలు, 319 సర్వేనెంబర్‌లో 1.14 ఎకరాల భూమి ఏడాది కాలనికి లీజుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే లక్ష్మీనర్సింహస్వామి జాతరను పురస్కరించుకొని కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డూ–పులిహోర, కొబ్బరిముక్కలు పోగు చేసుకొనే హక్కు, కూల్‌డ్రింక్స్ దుకాణాలు నిర్వహించేందుకు వేలం గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో ఉదయం 11.00 గంటలకు నిర్వహిస్తామన్నార. ఆసక్తి ఉన్నవారు నిర్ణయించిన ధరావత్తు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

హైటెన్షన్ టవర్ల సమస్య పరిష్కారం



హైటెన్షన్ టవర్ల తొలగింపు తర్వాత రహదారి

రామగుండం: కార్పొరేషన్ 22వ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీ అంతర్గత రహదారిలో అడ్డంగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లతో పాటు స్తంభాలు, వివిధ కాలనీల మీదుగా విద్యుత్ తీగలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ కౌశిక లతకు విన్నవించారు. దీంతో కార్పొరేటర్ ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం అందజేసి తన సొంత ఖర్చులు రూ.30వేలతో జేసీబీలు, వెల్డర్లు, కూలీలను ఏర్పాటు చేయించి విద్యుత్ తీగలతో పాటు, స్తంభాలను తొలగించారు. ఇందిరమ్మ కాలనీ, అయోధ్యనగర్, పోచమ్మవాడ, క్రషర్‌నగర్ కాలనీవాసులు కార్పొరేటర్ కౌశిక లతకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల పక్షాన పోరాడండి



నూతన కమిటీ సభ్యులతో ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి

రామగిరి: గుర్తింపు ప్రాతినిధ్య సంఘంగా కార్మికుల పక్షాన పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆర్జీ–3 డివిజన్ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని ఓసీపీ–2 ఏరియాలోని నూతన పిట్ కమిటీ, సేఫ్టీ కమిటీ, మైనింగ్ కమిటీల పరిచయ కార్యక్రమం నిర్వహించి అనంతరం సన్మానం చేశారు. పిట్ కార్యదర్శులుగా కె.నరసింహచారి, రామిల్ల మనోహర్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా దుండె రాజేందర్, మహిళా పిట్ కార్యదర్శిగా తేజ్ ప్రియా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.లక్ష్మయ్య, సేఫ్టీ కమిటీ సభ్యులుగా మండల రమేశ్, ఎస్‌కె అబ్దుల్ ఖాసీం, చంద్రశేఖర్, బిక్షనాయక్, మైనింగ్ కమిటీ సభ్యులుగా ఎం.వెంకటేశ్, కె.సత్యనారాయణ, కె.రాహుల్, రాళ్లబండి రవీందర్, సుగందర్‌రావు, సురేశ్, బుచ్చయ్య, మంగయ్య, నికేష్‌రెడ్డి, తిరుపతి, కొమురయ్య, క్యాంటీన్ కమిటీ సభ్యులుగా గౌడ సత్తయ్య, తాటికొండ మొగిళి, టెంపుల్ కమిటీ సభ్యులుగా ఏ.సుమన్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ఊయ్యాల కుమార్ స్వామి, మద్దిరాజ్‌కుమార్, సందెల కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఖిలావనపర్తి శ్రీలక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సభ్యులు

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని హుండీ లెక్కింపును మంగళవారం ఆలయ ఈవో కాంతరెడ్డి, చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్ ఆధ్వర్యంలో లెక్కించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆలయ హుండీ లెక్కింపులో భాగంగా నిర్వహించిన లెక్కింపులో రూ.46,688 వచ్చినట్లు ఈవో కాంతారెడ్డి వెల్లడించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఆలయ చైర్మన్ హన్మాన్‌సింగ్, ధర్మకర్తలు సునీత, లక్ష్మణ్, సాయిలు, అర్చకులు గరిమెళ్ల రవి, శ్రీనివాస్, గ్రామస్తులు రాంచందర్‌రావు, మల్లేశ్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గణాంకాలు సవరించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అందించిన సీఎంపీఎఫ్ చిట్టీల్లోని తప్పుడు గణాంకాలను సవరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం కార్మికులతో కలిసి ఆర్జీ–2 ఏరియా పర్సనల్ మేనేజర్ వంశీకి వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి అందించిన సీఎంపీఎఫ్ చిట్టీల్లో లెక్కలు సరిగా లేవన్నారు. వేతనాల్లో రికవరీ జీరోగా చూపించడంతో కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళ చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చమ్మ, తిరుపతి, రాయమల్లు, లక్ష్మి, స్వరూప, శారద తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీలో సోమవారం రాత్రి యువకునిపై కత్తితో దాడికి పాల్పడినట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఫోన్ సంభాషణ నేపథ్యంలో మాటమాట పెరిగి కరణ్ అనే యువకునిపై వినీత్ కత్తితో దాడికి దిగినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన కరణ్‌ను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి మామ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వినీత్, అతని తండ్రి, తల్లి, అన్నపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తూము ధ్వంసం

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని ఎల్లమ్మ, గుండమ్మ చెరువు కట్ట వద్ద గల తూమును సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న కొందరు స్థానిక రైతులు ఈ విషయాన్ని గుర్తించారు. తూముకు అమర్చిన షట్టర్‌ను గడ్డపారలతో పైకి లేపేందుకు దుండగులు యత్నించారు. ఈ క్రమంలో పైకప్పు సిమెంట్ బిళ్ల ధ్వంసమైందని స్థానిక రైతులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

మంథని: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో 28న నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు మారుపాక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తనుగుల విజయ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని నడివీధి గజానన మండలిలో నిర్వహించిన శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ కంటి ఆస్పత్రి వారితో శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కంటిచూపు, కంటి నరాల పరీక్ష, విజన్ పరీక్షలతో పాటు ఇతర కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు తమ హెల్త్ కార్డులు వెంట తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన

ఓదెల: ఓదెలలో కస్తూర్బా బాలికల పాఠశాలకు చెందిన కరాటేలో బ్లాక్‌బెల్టు సాధించిన విద్యార్థులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు మంగళవారం అభినందించారు. ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్టు సాధించిన విద్యార్థులు ఎం.కీర్తన, జి.సిరిచందన, పి.యశస్విని ఎమ్మెల్యే సన్మానించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న టూటౌన్ సీఐ రవీందర్, సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పరిధిలోని యైటింక్లయిన్‌కాలనీ కూమరస్వామి నగర్, టీ1, 2 క్వార్టర్స్ తదితర ఏరియాల్లో మంగళవారం రాత్రి గోదావరి ఖని టూటౌన్ సీఐ రవీందర్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు కుమారస్వామి నగర్, టీ1, 2 క్వార్టర్స్ ఏరియాలతో పాటు అనుమానాస్పద గృహాల్లో, ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే టూటౌన్ సీఐ ఫోన్ నెంబర్ 87126 56520లో సమాచారం అందించాలని కోరారు. అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు వెంకటేశ్, సనత్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడికతీత పనులు



పూడిక తీస్తున్న కార్మికులు

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో కార్యదర్శి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతి కార్మికులు మురికి కాలువలను మంగళవారం పరిశుభ్రం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు పలు వార్డుల్లో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తేనే ఆరోగ్యంగా ఉండగలుగుతామని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పర్వీన్ అన్నారు. పెద్దపల్లి మైనార్టీ బాలికల పాఠశాల (రంగంపల్లి)లో మంగళవారం బేటీపడావో.. బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా రుతుక్రమ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యుక్త వయస్సులో కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా క్రీడల అధికారి సురేశ్, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, రిసోర్స్ ఫీల్డ్ ఆఫీసర్ స్వర్ణ ఉన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపన ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు రెండోరోజు కొనసాగాయి. ఆలయ కమిటీ సభ్యులు సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేయగా, విగ్రహాలను వేద పండితులు పంచామృత క్షీరాభిషేకం చేయించడంతో పాటు హోమం నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గోదావరి నదికి తీసుకెళ్లి అభిషేకం చేయించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ప్రతిష్ఠాపన ఉత్సవాలలో వేదపండితులు కొండపాక రామానుజాచార్యులు, వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు హోమ, విగ్రహ పూజలు చేయగా సభ్యులు మేచినేని సంతోష్‌రావు, కుంట రాజేశ్వర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, దిడ్డి శంకరయ్య పాల్గొన్నారు.

మదర్ థెరిసా కాలేజ్‌లో మూడురోజుల వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో టాస్క్ ఆధ్వర్యంలో మూడురోజుల వర్క్‌షాప్ మంగళవారం మొదలైంది. ప్రస్తుతం నెలకొన్న పోటీని ఎదుర్కొనేందుకు విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాస్క్ రిసోర్స్ పర్సన్ రత్నప్రియ అన్నారు. విద్యార్థులకు ఇలాంటి వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కాలేజీలో అత్యాధునిక లాబొరేటరీలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే పోటీలో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. అకౌంట్స్ ఆఫీసర్ పవన్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్‌వోడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖని బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్

గోదావరిఖనిటౌన్: ఈ నెల 30న నిర్వహించనున్న గోదావరిఖని బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి కొనన శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మార్చి 26, 27న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్ స్వీకరణ, 27న మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4 వరకు నామినేషన్ పరిశీలన, 28న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉపసంహరణ, 28న మధ్యాహ్నం 2గంటలకు తుది జాబితా ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలింగ్ మార్చి 30న ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. కౌంటింగ్ మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగుతుందని చెప్పారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తాం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు దీర్ఘకాలిక పంట రుణాలు అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.3కోట్ల దీర్ఘకాలిక, రూ.5కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వరి సీజన్‌లో 11 కేంద్రాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో సీఈవో తిమ్మరాజు సంతోష్‌కుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.


మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖనిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, నాయకులు కొంకటి లక్ష్మణ్, కాంపల్లి సతీశ్, పులి మోహన్, మంతెన లింగయ్య, శనిగరపు రామస్వామి, ఇరుగురాల కృష్ణయ్య, గద్దల శశిభూషణ్, పంజా అశోక్, గొర్రె నర్సింగరావు, కనుకుంట్ల సమ్మయ్య, రాజేశం, బాబు, మహేందర్, రవి తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఈజీఎస్ ఏపీవో సదానందం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు పని చేస్తున్న తీరును, వారికి ఎండ తీవ్రత, తాగునీరు, వంటి వాటిపై ఉపాధిహామీ కూలీలను అడిగి తెలుసుకున్నారు.

మంగపేటలో కళాకారుల కళాజాత



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మంగపేట గ్రామంలో మంగళవారం జానపద కళాకారులు ప్రభుత్వ కళాకారులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, ఓటుహక్కు, బేటీ బచావో, బేటీ పడావో మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరిచారు. రాష్ట్ర సాంస్కృతిక సారధి కళాబృందం నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఇల్లందుల మల్లేశంగౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, కొండ వెంకన్నగౌడ్, ఈదునూరి పద్మ, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక,జిన్న రమాదేవి, శ్రీవల్లి పాల్గొన్నారు.